క్లుప్తంగా

గుర్రం జాషువాకు ఘన నివాళి



కల్వకుర్తి రూరల్: పట్టణంలోని టీఎస్ యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం గుర్రం జాషువా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి జిల్లా కార్యదర్శి పరశురాములు ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కవి సమ్మేళనంలో పలువురు కవులు హాజరయ్యారు. అసమానతలు లేని సమాజం కోసం జాషువా అక్షరయుద్ధం చేశారని కొనియాడారు. అనంతరం కవులను సత్కరించారు. కార్యక్రమంలో శీను గౌడ్, రాజేందర్ రెడ్డి, వెంకటయ్య, జయపాల్, అమర్‌సింగ్, సలీం, రామేశ్వరయ్య, సత్యనారాయణ, ఏపీ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీ



పెంట్లవెల్లి: మండలంలోని జటప్రోలులో ఆదివారం లబ్ధిదారులకు మాజీ ఎంపీపీ గోవింద గౌడ్ ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమం సాధ్యమన్నారు. మాజీ వైస్ ఎంపీపీ భీమ్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నాగిరెడ్డి. పెద్ద శీను చిన్న శీను, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృత్యువాత

బిజినేపల్లి: మండలంలోని పాలెంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై ఎద్దు మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన జహంగీర్ పాషా జొడ్డెద్దులను తన వ్యవసాయం పొలం నుంచి ఇంటికి తీసుకొస్తుండగా మార్గమధ్యలో ఒక ఎద్దు తెగిపడిన విద్యుత్‌తీగకు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు విలువ రూ.లక్ష వరకు ఉంటుందని బాధితుడు తెలిపాడు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



కోడేరు: మండలంలోని తీగలపల్లి గ్రామానికి చెందిన రాచూరి ఊశమ్మ అనారోగ్యంతో మృతిచెందింది. గ్రామస్తులు కొందరు డబ్బులను పోగు చేసుకొని రూ.22వేల ఆర్థికసాయం అందజేశారు. ఆర్థికసాయం చేసిన వారిలో శ్రీనివాస్‌రెడ్డి, లింగారెడ్డి, లింగమయ్య, శేఖర్‌రెడ్డి, గోపాల రాముడు, రేణయ్య, కుర్మయ్య, నిఖిలేష్, నిరంజన్, రమేష్‌లు ఉన్నారు.

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని హనుమాన్ నగర్ కాలనీకి చెందిన అరవింద్ బైక్ ప్రమాదంలో గాయపడ్డాడు. ఆదివారం బాధిత కుటుంబానికి మిత్ర ఫౌండేషన్ సభ్యులు రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు. వ్యవస్థాపక అధ్యక్షుడు కుడుముల చంద్రకాంత్ రెడ్డి, రసూల్ ఖాన్, శ్రీకాంత్ నేత, సలీం ఖాన్, కార్తీక్, తరుణ్, అరవింద్, జిలాని, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సంప్రదాయానికి ప్రతీక బతుకమ్మ

కల్వకుర్తి రూరల్: తెలంగాణ సంప్రదాయానికి ప్రతీక బతుకమ్మ అని అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, హిందూ వేదిక రాష్ట్ర నాయకుడు చికోటి ప్రవీణ్‌లు అన్నారు. ఆదివారం పట్టణంలోని వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వారు హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం బతుకమ్మ పండగకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రాంభూపాల్ రెడ్డి, ఆలయ చైర్మన్ కల్వ మనోహర్, నాయకులు పాల్గొన్నారు.




తెలకపల్లిలో ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న ఆలయ నిర్వాహకులు


అచ్చంపేట వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో...


తాడూరు మండలం పాపగల్‌లో..


కోడేరులో..

దుర్గామాత నమోస్తుతే

సాక్షి, నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. 7వ రోజు ఆదివారం అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించారు. తెలకపల్లిలోని వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో దుర్గామాతను ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి దంపతులు దర్శించుకున్నారు. బిజినేపల్లి, పెంట్లవెల్లి, ఉప్పునుంతల, కోడేరు, పెద్దకొత్తపల్లి, చండీదేవీగా అలంకరించారు. తాడూరులో మహాలక్ష్మిగా కొలిచారు. కల్వకుర్తి పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో వాసవి మాత శాకాంబరి దేవీ రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, ఆర్డీఓ జనార్దన్ రెడ్డి దర్శించుకొని పూజలు చేశారు. శ్రీశైల ఉత్తర ముఖద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రంలో అమ్మవారు కాళరాత్రి అలంకారంలో దర్శనమిచ్చారు. వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో పూజలు చేశారు.



కల్వకుర్తిలో శాకాంబరి దేవిగా, బిజినేపల్లి మండలం పాలెంలో మహాచండీదేవి అవతారంలో


ఉమామహేశ్వరంలో ..


తాడూరు మండలం గుంతకోడూరులో..


పెద్దకొత్తపల్లిలో..


ఉప్పునుంతల కేదారేశ్వరాలయంలో ..


పెంట్లవెల్లి మండలం జటప్రోలులో..

పట్టణ అభివృద్ధికి కృషి



అచ్చంపేట రూరల్: పట్టణానికి అధిక నిధులు కేటాయించి పట్టణ అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. ఆదివారం పట్టణంలోని పలు వార్డులలో అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అవసరం ఉన్న వార్డులలో సీసీ రోడ్లు, మురుగు కాలువలను ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో రూ. 30 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టనున్నామన్నారు. పట్టణాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఉత్సవాలు



కోడేరు: మండల కేంద్రంలోని ఉమామహేశ్వరాలయంలో ఆదివారం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఉత్సవాలను నిర్వహించారు. ఆర్‌ఎస్‌ఎస్ స్థాపించి వంద సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా గ్రామాల్లో ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు స్వయం సేవకులు తెలిపారు. హిందువులు కులాలను పక్కకు పెట్టి ఐక్యంగా మెలగాలన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, సంఘ్ చలాక్, గ్రామ యువకులు పాల్గొన్నారు.

ఘనంగా భగత్ సింగ్ జయంతి



కొల్లాపూర్ సీపీఎం కార్యాలయంలో భగత్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు


తెలకపల్లి మండలం గౌరెడ్డిపల్లిలో భగత్‌సింగ్ విగ్రహానికి పూలవేస్తున్న నాయకులు

కొల్లాపూర్ రూరల్: పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో భగత్ సింగ్ 118వ జయంతి వేడుకలను నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ఆపార్టీ మండల కార్యదర్శి శివవర్మ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేటి యువతకు భగత్‌సింగ్ ఆదర్శప్రాయుడన్నారు. స్వాతంత్య్రం ఉద్యమంలో పాల్గొని 23 ఏళ్ల యువప్రాయంలోనే దేశం కోసం ప్రాణాలర్పించాడని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

నాగర్‌కర్నూల్ రూరల్: స్థానిక పట్టణంలో డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఆదివారం భగత్‌సింగ్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాసులు మాట్లాడుతూ దేశ స్వాతంత్య్రం కోసం 23 ఏళ్ల వయసులోనే తన ప్రాణాలను తృణప్రాయంగా పెట్టి ఉరికొయ్యకు వేలాడుతూ దేశం కోసం అమరుయ్యాడన్నారు. భగత్‌సింగ్ స్ఫూర్తితో యువత ముందుకు నడవాలన్నారు. అంతకుముందు బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాదిల రామయ్య, జిల్లా కమిటీ సభ్యులు విరయ్య, సుల్తాన్, మల్లికార్జున్, మహేష్, వినోద్, అంజి, సుభాష్, వెంకటేష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

తెలకపల్లి: భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని రైతు సంఘం జిల్లా సమితి సభ్యులు శంకర్‌గౌడ్ కోరారు. ఆదివారం మండలంలోని గౌరెడ్డిపల్లిలో భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. పోరాటం, ఉద్యమం, తెగింపు దేశభక్తి యువతకు ఆదర్శమన్నారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, కృష్ణయ్య, శంకర్, ఎం నరేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్‌-2 ఉద్యోగాలకు ఎంపిక


మహేష్‌కుమార్


మాకం వర్ష


విజయ


వికాస్

కొల్లాపూర్ రూరల్: కొల్లాపూర్ మండలం ఎన్మనబెట్లకు చెందిన మహేష్‌కుమార్ గ్రూప్‌-2 ఫలితాల్లో సత్తా చాటాడు. సహకార శాఖలో అసిస్టెంట్ రిజిస్టర్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఇతను ప్రస్తుతం పెంట్లవెల్లి మండలంలోని ఎంగంపల్లిలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. గ్రూప్‌-2 ఉద్యోగం సాధించడంతో తల్లిదండ్రులు, సహోద్యోగులు, గ్రామస్తులు మహేష్‌ను అభినందించారు.

అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్‌గా..

వెల్దండ: మండలంలోని అల్లంతోట బావితండాకు చెందిన రాత్లావత్ విజయ గ్రూప్‌-2లో ప్రతిభ కనబరిచి సాధారణ పరిపాలన విభాగంలో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ ఉద్యోగం సాధించారు. రాష్ట్రంలో 1230 ర్యాంక్, 7వ జోన్‌లో ఎస్టీ క్యాటగిరి ఉమెన్స్‌లో మొదటి ర్యాంక్ పొందింది.

కార్యదర్శి నుంచి ఎక్సైజ్ ఎస్‌ఐగా..

మండలంలోని బైరాపూర్ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న వికాస్ గ్రూప్‌- 2లో 268వ ర్యాంక్ సాధించారు. కార్యదర్శి నుంచి ఎక్సైజ్ ఎస్‌ఐ ఉద్యోగం సాధించడంతో సంతోషం వ్యక్తం చేశారు.

సెక్రెటరియేట్ ఏఎస్‌ఓగా..

తెలకపల్లి: మండల కేంద్రానికి చెందిన మాకం వర్ష గ్రూప్‌-2 ఉద్యోగం సాధించింది. ఆమె తల్లిదండ్రులు మాకం మోహన్ వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తుండగా, తల్లి రజిత కస్తుర్బా పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తుంది. తెలంగాణ సెక్రెటరియేట్ ఏఎస్‌ఓగా ఉద్యోగం సాధించింది. తల్లిదండ్రులు, మండల ప్రజలు, పలువురు మాకం వర్షను అభినందించారు.

మందా సురేఖకు సాహితీ కీర్తి అవార్డు

నాగర్‌కర్నూల్‌రూరల్: కళావేదిక, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ బుక్ ఆఫ్ రికార్డ్స్, గోదావరి సోషల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ సాంస్కృతిక కళావేదిక తెలుగు రైటర్ అకాడమీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని బిర్లా ఆడిటోరియంలో సాహితి పట్టాభిషేక మహోత్సవం నిర్వహించారు. కళావేదిక జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరి భూషణ, కత్తిమండ ప్రతాప్ కుమార్ మేనేజింగ్ డైరెక్టర్, నాలేశ్వరం శంకరం, కావురి శ్రీనివాస్‌శర్మ గరిమెల్ల రాజేంద్రప్రసాద్‌ల చేతుల మీదుగా జిల్లా కేంద్రానికి చెందిన ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం డాక్టర్ మందా సురేఖకు సాహితీ కీర్తి అవార్డు ప్రదానం చేశారు. తెలుగు సాహిత్య రంగంలో సృజనాత్మకతను వెలిగించి ఆలోచనలకు అక్షర రూపం అందించిన సేవలకు గాను అవార్డుకు ఎంపిక చేశారు.

ఏఈఓకు ఏఓగా పదోన్నతి

వెల్దండ: క్లస్టర్ ఏఈఓగా విధులు నినిర్వహిస్తున్న సురేష్‌గౌడుకు ఏఓగా పదోన్నతి లభించింది. మూడు సంవత్సరాలుగా ఏఈఓగా బాధ్యతలు నిర్వహించారు. గద్వాల జిల్లా ఎర్రవల్లి మండల ఏఓగా బదిలీపై వెళ్లారు.

మైసమ్మ జాతరకు తగ్గిన భక్తుల రద్దీ



పెద్దకొత్తపల్లి: నాయినోనిపల్లి మైసమ్మ జాతరకు ఆదివారం భక్తులు తక్కువ సంఖ్యలో హాజరై మైసమ్మ దేవతను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. వర్షంతో భక్తులు తక్కువ సంఖ్యలో హాజరయ్యారు. భక్తులు లేక జాతరలో తినుబండరాలు, ఇతర దుకాణాలు బోసిపోయాయి. ఆర్టీసీ బస్సులలో ప్రయాణికులు లేక వెలవెల బోయాయి. మొత్తం 3000 మంది వరకు మైసమ్మ దేవతను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నట్లు ఎండోమెంట్ అధికారి రామేశ్వర్‌శర్మ తెలిపారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



తాడూరు: వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు భరత్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంతో ఆయా గ్రామాల్లో రైతులు సాగుచేసిన పంట పొలాలను పరిశీలించి రైతులో నష్టం వివరాలను తెలుసుకున్నారు. వర్షాల కారణంగా పత్తి పంట తెగుళ్లబారిన పడిందని వాపోయాడు. వ్యవసాయ అధికారులు పంటలను పరిశీలించి వివరాలను ప్రభుత్వానికి అందజేయాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణయ్య, ఊశన్న, వెంకటయ్య, నర్సింహ, శ్రీశైలం పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ సభకు తరలిన నాయకులు


కల్వకుర్తి నుంచి తరలివెళ్తున్న బీఆర్‌ఎస్ కార్యకర్తలు

కల్వకుర్తి/తెలకపల్లి/బిజినేపల్లి/వెల్దండ/చారకొండ: అచ్చంపేట నియోజకవర్గ కేంద్రంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన గర్జన బహిరంగ సభకు జిల్లాలోని పలు మండలాల నుంచి ఆ పార్టీ కార్యకర్తలు ఆదివారం తరలివెళ్లారు. తెలకపల్లితోపాటు గౌరారం, రాంరెడ్డిపల్లి, కారువంగ, నడిగడ్డలో బైక్ ర్యాలీ నిర్వహించి సభకు బయలుదేరారు. కల్వకుర్తి, తెలకపల్లి, బిజినేపల్లి, వెల్దండ, చారకొండ మండలాల నుంచి బీఆర్‌ఎస్ కార్యకర్తలు ప్రత్యేక వాహనాలలో తరలివెళ్లారు. గులాబీ జెండాలను పట్టుకొని నినాదాలు చేశారు. తరలివెళ్లిన వారిలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ విజితారెడ్డి, నాయకులు వెంకటయ్యగౌడు, జోగయ్య, వెంకటేశ్వర్‌రావు, చారకొండ మాజీ ఎంపీపీ గుండె నిర్మల విజేందర్ గౌడ్, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ హన్మంతు రావు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.


వెల్దండ నుంచి బయలుదేరుతున్న నాయకులు

ప్రధానమంత్రి మన్‌కీ బాత్ వీక్షించిన నాయకులు

పెద్దకొత్తపల్లి: మండలంలోని పెద్దకారుపాములలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ దూరదర్శన్ ద్వారా 126వ మన్‌కి బాత్ కార్యక్రమాన్ని 21, 22, 23, 25 బూత్‌లలో బీజేపీ కార్యకర్తలు ఆదివారం వీక్షించారు. భారత దేశ అభివృద్ధి గురించి ప్రధానమంత్రి ప్రస్తావించారు. జీఎస్టీ పొదుపు ఉత్సవాన్ని దసరా, దీపావళీ పండుగల సందర్భంగా దేశ ప్రజలకు జీఎస్టీ తగ్గింపు లాభాలు వివరించారు. ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాల విశిష్ట దేశ నిర్మాణంలో ఆర్‌ఎస్‌ఎస్ పాత్ర ఎంత ముడిపడిందో తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షులు జలాలుశివుడు, బీమేశ్వర్‌రెడ్డి, మేకల శివ పాల్గొన్నారు.


పెద్దకారుపాములల్లో మన్‌కీబాత్ వీక్షిస్తున్న బీజేపీ నాయకులు

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కల్వకుర్తి రూరల్: గిరిజన ఆశ్రమ పాఠశాలలో పని చేస్తున్న కార్మికులు కొన్ని రోజులుగా డిమాండ్ల సాధన కోసం నిరవధిక సమ్మె చేస్తున్నారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వచ్చిన జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి దామోదర రాజనర్సింహకు సీపీఐ నాయకుడు పరశురాములు ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. జీఓ 212 ప్రకారం ఐదు సంవత్సరాలు పనిచేసిన కార్మికులందరినీ క్రమబద్ధీకరించాలని కోరారు. కార్మికులు అలివేల, బుజ్జి, యాదమ్మ, జానకమ్మ, నీల తదితరులు పాల్గొన్నారు.


మంత్రికి వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

మంత్రులకు వినతి

ఉద్యోగ, ఉపాధ్యాయులకు సమస్యగా ఉన్న 317 జీఓను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఆదివారం కొండారెడ్డిపల్లి పర్యటనకు వచ్చిన రాష్ట్ర మంత్రులు వాకిటి శ్రీహరి, దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావులకు రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మునగాల సతీష్ వినితిపత్ర అందించారు. మేధావి వర్గాన్ని చీల్చే ప్రయత్నంలో భాగంగా 317 జీఓను తెచ్చారని వివరించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి తో మాట్లాడి న్యాయం చేయాలని మంత్రులను కోరారు.

వేరుశనగ విత్తనాల కోసం దరఖాస్తు చేసుకోవాలి

కొల్లాపూర్ రూరల్: పట్టణంతో పాటు పాన్‌గల్ మండలాలకు చెందిన వేరుశనగ రైతులకు విత్తనాలు ఉచితంగా పొందడానికి ఈ నెల 29 నుంచి అక్టోబర్ 3 వరకు దరఖాస్తు చేసుకోవాలని రత్నగిరి ఫౌండేషన్ కన్వీనర్ కేతూరి ధర్మతేజ, సంస్థ ప్రతినిధి శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం పట్టణంలోని రత్నగిరి ఫౌండేషన్ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. రత్నగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వ నూనె గింజల అభివృద్ధి పథకం కింద రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ శాఖ సహకారంతో రెండు మండలాలకు చెందిన 2 వేల మంది వేరుశనగ రైతులకు ఒక ఎకరాకు ఉచితంగా అందజేస్తున్నట్లు వారు తెలిపారు. ఆసక్తి గల రైతులు తమ ఆధార్, పట్టాదారు, బ్యాంక్ పాసు పుస్తకాల జిరాక్స్ రెండు ఫొటోలను, స్వీయ ధ్రువీకరణ పత్రాన్ని కొల్లాపూర్ రత్నగిరి ఫౌండేషన్ కార్యాలయంలో అందజేయాలని వారు కోరారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

రహదారులు ఇలా.. వెళ్లేదెలా?

తాడూరు: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్లు దెబ్బతిన్నాయి. రహదారులపై వర్షం నీరు నిలిచింది. అంతర్గత రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే దారులు పూర్తిగా వర్షపు నీటితో దర్శనమిస్తున్నాయి. వివిధ పనుల నిమిత్తం కార్యాలయాలకు వెళ్లే ప్రజలు ఎన్నో అవస్థలు పడుతున్నారు. సీసీ రోడ్డు పూర్తిగా బురదమయంగా మారింది. మండల కేంద్రంలోని ప్రభుత్వం ప్రాథమిక ఆస్పత్రికి వెళ్లేందుకు రోగులు నరకయాతన అనుభవిస్తున్నారు. గేటు ఎదుట వర్షపు నీరు నిలిచి చెరువును తలపిస్తోంది. అదేవిధంగా సబ్‌స్టేషన్ లోపలికి వెళ్లేందుకు వీలు లేకుండా పోయింది. అధికారులు పరిశీలించి, వర్షపు నీరు నిల్వ ఉండకుండా తాత్కాలిక మరమ్మతు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


సబ్‌స్టేషన్ ఎదుట నిలిచిన వర్షపు నీరు